అంతకు పదిరోజుల క్రితం ఒక ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్ తనకు తెలియకుండా దాదాపు వందఫోటోలు తీశాడని ఆమెకు తెలీదు.

ఆమె వెళ్ళేసరికి గేటు దగ్గర ఒక వ్యక్తి ఎదురు చూస్తున్నాడు. వినయంగా విష్ చేసి ఆమెని లోపలికి తీసుకెళ్ళాడు.

ఎత్తయిన, విశాలమైన సింహద్వారం అది. షాపులా లేదు. చాలా రిచ్‌గా వుంది. ముందో గదిలా వుంది. రెండువైపులా గోడలున్నాయి. పెద్ద పెద్ద తెరలు ...... !

గదిలో చాలా ఖరీదైన సోఫా సెట్ వుంది. మధ్య బల్లమీద పుస్తకాలున్నాయి. గోడలకు అమర్చిన స్పీకర్స్‌లోంచి మ్యూజిక్ వస్తోంది.

బీతోవెన్...

బీతోవెన్ మ్యూజిక్ ఎప్పుడూ మంద్రస్వరంలోనే వినాలి. అది తెలిసే తక్కువ స్థాయిలో పెట్టినట్టున్నారు. వారియొక్క టేస్టుకు మనసులో మెచ్చుకోకుండా వుండలేకపోయింది. ఏపాట ఎలా వినాలో తెలుసుకోవటం కూడా కళే.

స్పీకర్‌లో సింఫోని నెం 5. ...... ఎల్ గ్రో కాన్‌బ్రియో బీతోవెన్ వస్తోంది.

సెంటు స్ప్రే చేసినట్టున్నారు. గదిలోని గాలంతా పరిమళంతో నిండివుంది.

అంతా నిశ్శబ్దంగా వుంది. అంత నిశ్శబ్దంలో ...... గాలిలోంచి తేలి వస్తున్నట్టు వయోలిన్‌ల నాదం మనసుని ఎక్కడికో తీసుకు వెళ్తూంది. వాయులీనాల మధ్య అప్పుడప్పుడు వినపడుతూన్న పియానో, శాక్సోఫోన్‌ల గతులు మనసుమీద లయబద్ధంగా అడుగులేస్తున్నట్టున్నాయి.

ఆమె ఆ స్వరాన్ని ఆస్వాదిస్తూండగా "లోపలికి రండి మిస్ లక్ష్మి " అని వినిపించింది.

ముందామె ఆ మాటలు కూడా పాటలో ఒక భాగంగా స్పీకర్‌లోంచి వచ్చాయనుకుంది. అంత మధురంగా, గంభీరంగా వుందా స్వరం. అది తనకోసం పిలుపు అని అర్థమై ఆమె తన పొరపాటుకి నవ్వుకుంటూ తెరలు తొలగించింది.

ఏదో రాజభవనపు ముఖద్వారానికి కట్టినట్టున్న విశాలమైన తెరల మధ్య నుంచి ఆమె లోపలి హాలులోకి ప్రవేశించింది.

లోపలికి ప్రవేశించిన లక్ష్మి.... అక్కడి దృశ్యాన్ని చూసి అవాక్కయి ఆగిపోయింది. ఆకస్మాత్తుగా అలుముకున్న నిశ్శబ్దం ఆ దిగ్భ్రమకు మరింత మూడ్‌ని జతకూర్చింది.

అది విశాలమైన హాలు, ఆఫీసు కాదు. నాలుగువైపులా ఎత్తయిన గోడలు. మధ్యలో నిలువెత్తు స్థంభాలు. గోడలకి పెద్దపెద్ద చిత్రాలున్నాయి. నిలువెత్తువి. రకరకాల భంగిమల్లో ......

అన్నీ ఆమెవే.

నిల్చున్నని ...... కూర్చున్నవి ...... నవ్వుతున్నవి ...... ఏదో పనిచేసుకుంటూ పరధ్యాసలో వున్నవి ...... క్లోజప్‌లు ...... పోర్ట్రేట్‌లు ......

తను చూస్తున్నది కలో నిజమో తెలియని స్థితిలో ఆమె అడుగు ముందుకేసింది.

బీతోవెన్ కన్సర్ట్‌లో "టర్కిష్ మార్చ్" సింఫోనీ మొదలైంది. ఆమె అడుగులకు లయబద్ధంగా, యాదృచ్ఛికంగా అది మ్యాచ్ అయినట్టుంది.

ఆమె నడుస్తూ ముందు కెళ్తూంటే ...... ఒక్కొక్క నిలువెత్తు చిత్తరువూ ...... వరస తాటిచెట్ల మధ్య మనిషి నడుస్తూంటే చెట్లు వెనక్కి వెళ్ళినట్టు వెళుతున్నాయి. ఆమె ఆగి వున్నట్టు, అవి కదుల్తూన్నట్టు అనుభూతి.

ఆమె అయోమయంతో, ఉద్వేగంతో, ఆ చిత్రాలకేసి చూస్తోంది. అంతలో "గుడ్ ఈవినింగ్" అని వినిపించింది. ఆమె ఉలిక్కిపడి అటు చూసింది.

చిత్రాల్లో చిత్తరువుగా కలిసిపోయి వున్నాడు ప్రహసిత్! ఆమె అప్రయత్నంగా అడుగు వెనక్కి వేసింది. బీతోవెన్ మ్యూజిక్ ఒక్కసారిగా ఉచ్ఛస్వరంలోకి చేరుకుంది.

అతడు బొమ్మల మధ్యనుంచి బయటకు వస్తూ మళ్ళీ ఒకసారి "గుడ్ ఈవెనింగ్ " అన్నాడు.

ఆమె ఇంకా దిగ్భ్రమ నుంచి తేరుకోలేదు. అతడివైపు బ్లాంక్‌గా చూస్తోంది.

అతడు చిరునవ్వుతో " ...... మన కలయిక ఇంతకన్నా బాగా ఎలా ఏర్పాటు చేయాలో నాకు తోచలేదు. నేను మీలా రచయితని కానుగా" అన్నాడు.

హాల్లో లైటు వెలుతురు ...... ఒక నిలువెత్తు బొమ్మలో ఆమె కట్టిన ఎర్రచీరపై బడి ఆమె ప్రస్తుతం కట్టుకున్న నీలం చీరెపై ప్రతిబింబించి, వెల్వెట్ కలర్‌గా పరివర్తనం చెందుతోంది.

అతనన్నాడు... "నా మనసులో మాట మీకు చెప్పాక, మనం కలిసే మొదటి కలయిక అద్భుతమైన అనుభవంగా మిగిలిపోవాలనుకున్నాను. కాని మీ దగ్గర్నుంచి ఏ రెస్పాన్సూ లేదు. దాదాపు పిచ్చెక్కే స్థితిలో వుండగా, అదృష్టవశాత్తూ ఒక జర్నలిస్టు మీ నెంబరు చెప్పింది. నాకు స్వర్గద్వారాలు తెరుచుకున్నట్టు అనిపించింది. కానీ మిమ్మల్ని వెంటనే కలుసుకోవాలన్న ఆతృతని అతికష్టంమీద అణుచుకున్నాను" అతను ఆగి అన్నాడు.

" ...... మీ అడ్రసు తెలిసిన వెంటనే నేను మిమ్మల్ని కలుసుకోకపోవటానికి కారణం వుంది. చెప్పానుగా ...... మన మొదటి కలయిక ...... తరువాత ఒక మంచి జ్ఞాపకంగా మిగిలిపోవాలి! దాన్ని ఆ తరువాత్తరువాత తలుచుకునే కొద్దీ మన మనసులో తీయటి అనుభూతిగా మిగలాలని...... ! అందుకే ఆలోచించాను. చాలా మంది ఎక్స్‌పీరియన్స్‌ని మామూలుగా అనుభవించి వదిలేస్తారు. నాకు ప్రతి మంచి అనుభవాన్ని జాగ్రత్తగా తీర్చిదిద్దుకొని, ఒక మంచి అనుభూతిగా మలచుకుని దాచుకోవటం ఇష్టం. అందుకే మనం మొదటిసారి ఎలా కలుసుకుంటే బావుంటుందా అని ఆలోచించాను. మీకు తెలియకుండా ఒక ఫోటోగ్రాఫర్‌తో ఫోటోలు తీయించాను. టెలిలెన్స్‌తో ...... వివిధ భంగిమల్లో ...... "

ఆమె మొహం ఎర్రబడింది.

అతడు దాన్ని గమనించలేదు. ఒకరకమైన ఉద్వేగంతో అన్నాడు “మీ ఫోటోలు అందాక దేశపు నలుమూలల్నుంచీ పోర్ట్రైట్ పెయింటర్స్ని పిలిపించాను. ది బెస్ట్ పెయింటర్స్! ఎంత ఖర్చయినా ఫర్వాలేదు. ...... నాకు మాత్రం ఒక్కొక్కరి దగ్గర్నుంచి వారం రోజుల్లో రెండు చిత్రాలు కావాలని చెప్పాను. వారు నన్ను చూసి నవ్వుకోలేదు. కళాకారులు.. అర్థం చేసుకున్నారు. వెంటనే రంగంలోకి దిగారు. సముద్రానికి వారధి కట్టినట్లు వాళ్ళు కుంచెలు కదిపారు. నిద్రాహారాలు మాని ఈ చిత్రాల్ని తయారు చేశారు. కేవలం వారం రోజుల్లో ఇన్ని చిత్రాలు పూర్తి చేశారంటే, దాన్ని బట్టి ఎంత కష్టపడి వుంటారో అర్థం చేసుకోవచ్చు. దీన్ని ఒక యజ్ఞంలా తీసుకుని చేశారు. చూడండి. చుట్టూ చూడండి. ఒక్కొక్క దానిలోనూ జీవకళ ఉట్టిపడటం లేదూ?”.

ఆమె చుట్టూచూడలేదు. అతడివైపు చూస్తోంది. కళాకారుల్లాగే క్రీడాకారులూ పిచ్చివాళ్ళేనా? వాళ్ళ వాళ్ళ రంగాల్లో అత్యున్నత స్థానానికి వచ్చిన వాళ్ళందరూ ఆ ప్రపంచంలోనే నిరంతరం వుండిపోయిన మాట నిజమేగానీ, ప్రహసిత్ పట్ల ఈ సత్యం నిజం కాదనిపిస్తోంది. క్రీడాకారుల్లో ప్రకృతిపట్ల ఇంత ఆకర్షణ వుండటం అరుదు. దూసుకువస్తున్న టెన్నిస్ బంతిని ప్రత్యర్థికి ఎలా తిప్పికొట్టాలా అని తీక్షణంగా చూసే అతడి కళ్ళు ప్రస్తుతం ఏ స్వప్న లోకాలల్లోనో విహరిస్తున్నట్టున్నాయి.

కానీ ......

ఆమెకెందుకో అమితమైన దుఃఖం కలిగింది. అది అకారణ దుఃఖం కూడా కాదు.

ఆమె మౌనాన్ని అతడు మరోలా అర్థం చేసుకున్నాడు.

“మీపట్ల నేను నా ప్రేమని ఈ విధంగా ప్రకటించటం మీకు నాపై తక్కువ భావాన్ని కలుగజేస్తోందా?” అనుమానంగా అడిగాడు. అతడలా ఎందుకడిగాడో ఆమెకి అర్థం కాలేదు.

అతడే మళ్ళీ అన్నాడు ...... “మీరనుకుంటున్నారు కదూ! డబ్బు ఖర్చు పెడితే ప్రేమ ఉద్భవించినట్లు కాదు. ఏ అమ్మాయి అయినా హృదయానికీ ప్రేమకీ దాసోహం అంటుందే తప్ప డబ్బు ఖర్చుపెట్టి పటాయించాలనుకుంటే పడదు ...... అనుకుంటున్నారు కదూ!”.

ఆమెకు నవ్వొచ్చింది. అంత పెద్దవాడూ ‘పటాయించటం’ అన్నమాట ఉపయోగించినందుకు కాదు. కొందరు నిత్యశంకితులు. ప్రేమలో మరీనూ ...... అవతలివారి ప్రతి చర్యలోంచీ ( అది ప్రియుడుగానీ, ప్రియురాలుగానీ ) ఏదో ఒకటి బయటకు లాగి, దాన్ని తమ అనుమానాలకి అన్వయించుకుని ‘నువ్విలా ఎందుకు చేశావ్? అలా ఎందుకు చేయలేదు’ అని వేధిస్తూవుంటారు. ప్రతీ పనికీ అనుమానం వెలిబుచ్చి, అవతలి వారిని సందేహాల్తో వేధిస్తూ వుంటారు.

ప్రహసిత్‌నే తీసుకుంటే, ఆ రోజు ఫోన్ చేసి “మొదటిసారి చూడగానే ప్రేమలో పడటం ఏమిటి? అని అనుమానిస్తున్నారా ...... ” అంటూ సంశయం వెలిబుచ్చాడు. ఇప్పుడు ఇదంతా కష్టపడి చేసి, “డబ్బుతో నా ప్రేమని ప్రదర్శిస్తున్నాననుకుంటున్నారా?” అంటూ మరో అనుమానం లేవనెత్తాడు.

అందుకే ప్రేమికులు నిత్య శంకితులు.

ఆమె ఏమీ మాట్లాడకుండా మౌనంగా వుండేసరికి దాన్ని మరోలా అర్థం చేసుకున్నాడు. “ఒకటినుంచి పదిలోపులో మూడు అంకెలు చెప్పండి” అన్నాడు.

అతడు చప్పున అలా అడిగేసరికి ఆమె బిత్తరపోయి అతడెందుకు అడుగుతున్నాడో తెలియక “ ...... మూడు ...... ఏడు ...... తొమ్మిది ” అంది.

అతడు కళ్ళు మూసుకున్నాడు.

ఆమెకి అర్థం కాలేదు.

అతడేం చేయబోతున్నాడో ఏం చెప్పబోతున్నాడో తెలియలేదు. అతడు మాత్రం ఈ లోకంలో లేడు.

'డ్యూస్' అయి, అవతలి ప్రత్యర్థి అడ్వాంటేజిలోకి వచ్చి గేమ్ పాయింట్‌లో వున్నప్పుడు ...... సర్వీస్ చేయబోయే ముందు వంట్లో వున్న శక్తినంతా చేతుల్లోకి తెచ్చుకోవటం కోసం ఆటస్థలంలో కళ్ళు మూసుకుని మెదడుని కాన్సన్‌ట్రేట్ చేస్తున్నట్టు వున్నాడు.

ఆ తరువాత అతడి కంఠం వినపడింది.

**"ఏది నైతికమని ప్రశ్నించుకుంటే, భౌతికమైనదేదీ నైతికం కాదని తెలుస్తుంది. చిరునామా తెలియని తుమ్మెద కోసం పువ్వు విచ్చుకోవటం నైతికమా? నైతికమూ అనైతికమూ అని రెండు వేర్వేరు లేవు. అనైతికమే పరిస్థితిని బట్టి, స్థలాన్ని బట్టి, కాలాన్ని బట్టి నైతికంగా మారుతుంది. అనైతికాన్ని నైతికం చేసేది అవసరం ...... "**

ఆమె వులిక్కిపడింది.

అది తన వాక్యమే కానీ అతడు దాన్ని ఇప్పుడు ఎందుకు ప్రస్తావించాడో అర్థం కాలేదు. ఈ లోపులో అతడు రెండోది చెప్పాడు.

**" ...... గుండె గుండెకో సన్నాయి వుంటుంది. అదెప్పుడూ ఆర్తిగా శివరంజనే ఆలపిస్తూ వుంటుంది. ఒక హృదయంనిండా మరొక హృదయం ఊపిరి ఊదినప్పుడే అది కళ్యాణిగా మారుతుంది".**

ఆమెకి అర్థమైంది. దిగ్భ్రాంతురాలైంది.

అతడు తన అధ్యాయాల మొదటి వాక్యాలు చెపుతున్నాడు.

ఇప్పటికి పత్రికలో పది అధ్యాయాల ప్రచురణ పూర్తయింది. అందుకే ఒకటి నుంచి పదిలోపు మూడు అంకెలు చెప్పమన్నాడు. తను 'మూడు, ఏడు, తొమ్మిది' అంటూ నోటికొచ్చిన అంకెలు చెప్పింది. అతడు చెప్పిన మొదటి వాక్యం మూడో అధ్యాయం ప్రారంభంలోది! రెండోది ఏడో అధ్యాయం మొదటిది.

ఆమె నిశ్చేష్టురాలై కళ్ళప్పగించి చూస్తూండగానే అతడు తొమ్మిదో అధ్యాయపు ప్రారంభాన్ని చెప్పాడు.

**"అర్థరాత్రి ...... లోక రహస్యాల్ని విప్పుతూన్న కవిలా ...... తలవంచుకుని వ్రాసుకుపోతూంటాను. ప్రపంచం నలుమూలల్లోకీ, దిగంతాల శూన్యంలోకీ పయనించి, ఎక్కడెక్కడి నుంచి, భావాల్ని ఏర్చి కూర్చి మాలల్ని తెస్తాను. నువ్వు మాత్రం నా పక్కనే అల్లుకుపోయి, విశ్వ రహస్యాన్ని విప్పుతావు".**

...... ఆమె వ్రాసిన తొమ్మిదో అధ్యాయపు మొదటి పేరా అది!

ఆమె తన ఉద్విగ్నతని ఆపుకోవటానికి చాలా కష్టపడవలసి వచ్చింది.

అతడు మొత్తం తన నవలనంతా  కం...... ఠతా వచ్చేటన్నిసార్లు చదివాడని అర్థమైంది। ఆమె కళ్ళనిండా అప్రయత్నంగా నీళ్ళు నిండాయి.

అది ప్రేమ కానీ కాకపోనీ ...... ఒక కళాకారుడికి ఇవ్వగలిగే అతి గొప్ప నీరాజనం అది.

ఆ కన్నీళ్ళు ఆమె నుంచి వచ్చినవి కావు. ఆమెలోని రచయిత్రి నుంచి వచ్చినవి. క్షణాల్లో ఆమె సర్దుకుని మామూలు మనిషైంది.

అతడి వైపు సూటిగా చూసింది.

వందల సంవత్సరాలు తపస్సు చేసి, దేవుడు ప్రత్యక్షమయ్యాక వరమడిగి దాన్ని తీరుస్తాడా లేదా అని చూసే భక్తుడిలా వున్నాడు ప్రహసిత్.

"మీరు నా ఫోటోలని చూశారా ప్రహసిత్" అని అడిగింది. ఈ సారి ఆశ్చర్యపోవటం అతని వంతయింది. లేదన్నట్టు తలూపాడు.

"పోనీ ఈ బొమ్మల్ని?"

"మీతోనే నేనూ ఈ గదిలోకి ప్రవేశించటం" అదే మొదటిసారి అన్నట్టు చెప్పాడు.

ఆమె వెళ్ళి ఒక నిలువెత్తు చిత్తరువు ముందు నిలబడింది. అప్రయత్నంగా అతడూ వెనుకే నడిచాడు.

ఆమె దానిని చూస్తూ అన్నది ...... "మీరు చాలా పొరపాటు చేసారు ప్రహసిత్. ప్రేమలో పడిన వారు చిత్తరువుల్నీ, గత జ్ఞాపకాల్నీ ఆశ్రయించి బ్రతుకుతారట. మీరు నాకు చూపించటం కోసం ఇన్ని బొమ్మల్ని తయారు చేయించారు. వీటిముందు ఒక క్షణం గడిపి వుంటే ...... అది ఒయాసిస్ కాదని ఎండమావి అనీ తెలిసి వుండేది. ఆ బొమ్మని చూడండి. కాలికి మట్టెలూ, మెడలో సూత్రాలూ కనపడటం లేదూ?".

అతడు స్థబ్దుడయ్యాడు.

సుఖమనే సంపద కన్నా దుఃఖమనే ఆపదకే శక్తి ఎక్కువ. మధురమైన జ్ఞాపకం కన్నా ...... మరపురాని బాధకే వయసు ఎక్కువ.

అశ్రువు కన్నా విషాదదూతిక ఏమయినా వుంటుందా?

తన బాధకు ఆ అశ్రువుని రాయబారి చేయకుండా వుండటం కోసం అతను చాలా కష్టపడ్డాడు.

ఆనందాన్ని ప్రకటించటానికి కోటిగొంతుల కిన్నెరలు కావాలి. విషాదాన్ని ప్రకటించటానికి ఒక గుండె కంజరి చాలు.

అనుభవం ఉపాధ్యాయుడై, మనసుకి ఎలా దుఃఖించాలో నేర్పుతోంది.

ఆ శిథిలాల నుంచి తేరుకుని అతడు కనులెత్తేసరికి ఆమెలేదు.